సాక్షి
అనంతపురం

శనివారం । 19 । జూలై । 2025



నాణ్యత తుంగపాలు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల్లో నాణ్యత కొరవడుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. 8లో



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం

34.2°/22.8°

జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి.ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అమ్మా సారీ.. మీరు జాగ్రత్త!

- ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టి.. యువకుడి ఆత్మహత్య



మల్లికార్జున (ఫైల్)

బుక్కరాయసముద్రం: 'అమ్మా వెరీ సారీ. ఇక మీ కొడుకు లేడు. మీరు జాగ్రత్త' అంటూ ఓ యువకుడు సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టి అనంతరం బలవన్మరణానికి పాల్పడ్డాడు. బొమ్మలాటపల్లి శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్పల మండలం పులసలనూతల గ్రామానికి చెందిన ఆదినారాయణ, మునేశ్వరి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం గడిపేవారు. వీరికి మానస, మల్లికార్జున (23) సంతానం. కుమార్తె మానసకు ఇటీవల పెళ్లి చేశారు. మల్లికార్జున అనంతపురంలో ఓ డ్రైవింగ్ స్కూల్‌లో కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు. ఏమైందో తెలియదు కానీ బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లి వద్దకు చేరుకుని అక్కడ తల్లికి ఫేస్‌బుక్‌లో 'అమ్మా వెరీ సారీ. ఇక నీ కొడుకు లేడు. మీరు జాగ్రత్తగా ఉండండి. మళ్లీ వస్తాను. బాయ్. లవ్‌యూ మా. మానస కడుపులో పుడతాను. నా కోసం మీరు ఉండాలి. నాన్నకి చెప్పు..ఐ మిస్ యూ. మా లవ్‌యూ మా' అంటూ మెసేజ్ చేసి.. అనంతరం చెట్టుకు ఉరేసుకున్నాడు. మల్లికార్జున ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనేది పోలీసుల విచారణలో తేలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు భారీ వర్ష సూచన

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు శనివారం భారీ వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొన్నారు. తర్వాత నాలుగు రోజులు కూడా వర్ష సూచన ఉందని తెలిపారు. 20న 14 మి.మీ, 21న 10 మి.మీ, 22న 15 మి.మీ, 23న 12 మి.మీ. వర్షం కురిసే సూచన ఉన్నట్లు వెల్లడించారు.

సునీతమ్మా.. నోరు అదుపులో పెట్టుకో

సాక్షి, పుట్టపర్తి: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నోరు అదుపులో పెట్టుకోవాలని.. దద్దమ్మలు ఎవరో ప్రజలందరికీ తెలుసని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగానే రామగిరి ఎంపీపీ ఎన్నికను వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు బహిష్కరించారన్నారు. ఈ ఏడాది మార్చిలో ఎంపీపీ ఎన్నికకు వస్తుండగా.. టీడీపీ కార్యకర్తలు విధ్వంసాలకు పాల్పడుతున్నా..పోలీసులు చేష్టలుడిగి చూశారన్నారు. గతంలో (2017) కనగానపల్లిలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ ఉన్నప్పటికీ.. పరిటాల సునీత మంత్రి హోదాలో సమావేశానికి హాజరై వైఎస్సార్‌సీపీ సభ్యులతో బలవంతంగా చేతులు ఎత్తించి సరిపూటి గీతను ఎంపీపీ చేశారని గుర్తు చేశారు. అధికార దాహంతో దౌర్జన్యాలకు పాల్పడుతూ.. బెదిరింపులకు దిగుతూ ఎన్నికలకు తహతహలాడుతున్నదెవరో ప్రజలందరికీ తెలుసన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

13 నెలల్లోనే కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- తాడిపత్రిలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో నరేష్‌కుమార్‌రెడ్డి, శైలజానాథ్, గిరిజమ్మ, రమేష్‌రెడ్డి, ఫయాజ్‌బాషా తదితరులు

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. విద్యార్థుల కోసం ఫీజురీయింబర్స్‌మెంట్, రైతుల కోసం అన్నదాత సుఖీభవ, యువతకు ఉద్యోగాల కల్పన తదితర హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపుతో కార్యకర్తలు రోడ్లపైకొచ్చి ఆందోళనలు చేస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదలు, మహిళలు, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉన్న ఒకే ఒక్క పార్టీ వైఎస్సార్‌సీపీ అని తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తాడిపత్రిలోని వైఎస్సార్‌సీపీ పాత కార్యాలయంలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంటరీ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి, శింగనమల సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత సభా ప్రాంగణంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. కూటమి పాలనలో హామీలు అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ఒకటీ రెండు పథకాలు అమలు చేసినా అనేక కొర్రీలతో లబ్ధిదారుల సంఖ్య కుదించేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు మోసాలపై ప్రజలను చైతన్యవంతులను చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 13 నెలల కూటమి పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక చీనీ, మామిడి తదితర రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ నాయకుల చర్యల వల్ల కోన ఉప్పలపాడుకు చెందిన సుదర్శన్‌రెడ్డి అనే రైతు తోటకు సంబంధించిన పైప్‌లైన్ రోడ్డు పక్కన ఉందని తొలగించడంతో దాదాపు 500 చీనీచెట్లు నీరందక ఎండిపోయాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నపూస వెంకటరామిరెడ్డి, సహాయ కార్యదర్శి జిలాన్‌బాషా, నాయకులు యాడికి బొంబాయి రమేష్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయన్ను నమ్మితే వెన్నుపోటే



నమ్మిన వారిని వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అలవికాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి రాగానే విస్మరించడం షరా మామూలైపోయిందని ధ్వజమెత్తారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత ఇలా ప్రతి ఒక్కరినీ వంచనకు గురి చేశారన్నారు.

బాబు మోసాలు వివరిద్దాం



చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల గురించి ప్రజలకు వివరిద్దామని మాజీ మంత్రి శైలజానాథ్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చి దాని గురించి ఇప్పుడు మాట్లాడటం లేదన్నారు. ఏడాది దాటిపోయినా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించలేదన్నారు. సూపర్ సిక్స్ సహా వందల సంఖ్యలో ఇచ్చిన హామీలు.. ఎంతమేరకు అమలు చేశారన్న దాని గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఆకాంక్షలకు తూట్లు



మంచి చేస్తారేమోనన్న ప్రజల ఆకాంక్షలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచిందని జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ విరుచుకుపడ్డారు. హామీలతో ఓటర్లను ఆకర్షించి.. గద్దెనెక్కిన తర్వాత వారికి రిక్తహస్తం చూపడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లకే పింఛన్ మంజూరు తదితర హామీలను అటకెక్కించారన్నారు. తల్లికి వందనం పథకం అమలులో అనేక కొర్రీలు వేయడంతో దాదాపు సగం మంది లబ్ధి పొందలేకపోయారన్నారు.







'చంద్రబాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు, కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన తాడిపత్రి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

దుర్మార్గపు పాలనకు చరమగీతం



కూటమి సర్కారు అండతో తాడిపత్రిలో దుర్మార్గపు పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు కేతిరెడ్డి హర్షితారెడ్డి మండిపడ్డారు. సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రానీయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా పెద్దారెడ్డి భయపడే ప్రసక్తే లేదన్నారు. పెద్దారెడ్డికి అండగా ఉన్న కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' ద్వారా బాబు మోసాలను ఇంటింటికీ తెలియజేయాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి అన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమ కేసులతో ఇబ్బందులు పడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయం దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి కార్యకర్తకూ న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు.

అరాచకాలకు అడ్డుకట్ట వేద్దాం



తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి అరాచకాలకు అడ్డుకట్ట వేద్దామని వైఎస్సార్‌సీపీ నేత ఫయాజ్‌బాషా అన్నారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇళ్ల నిర్మాణాలు కూల్చివేత లాంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, అరాచకాలపై పోరాడుదామన్నారు. వచ్చే ఎన్నికల్లో తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు.

అభివృద్ధి శూన్యం



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధీ జరగలేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ధ్వజమెత్తారు. బాబు వస్తే జాబ్ గ్యారంటీ అని చెప్పి చంద్రబాబు, చిన్నబాబు, కళ్యాణ్‌బాబులకే జాబ్‌లు వచ్చాయి తప్ప యువతకు రాలేదని ఎద్దేవా చేశారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేశారన్నారు.

మజ్దూర్ యూనియన్ క్లీన్ స్వీప్



ఎల్లప్పకు డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

గుంతకల్లు: రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ క్లీన్ స్వీప్ చేసి జయకేతనం ఎగరవేసింది. ఎన్నికల్లో ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్ అభ్యర్థులు పోటీ చేశారు. గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 944 మందిలో 865 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రాత్రి 7.45 గంటల వరకు సాగింది. మజ్దూర్ యూనియన్ తరఫున కార్యదర్శి స్థానానికి పోటీ చేసిన ఎల్లప్పకు 457 ఓట్లు రాగా, ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి అభ్యర్థి మల్లికార్జునకు 401 వచ్చాయి. దీంతో 56 ఓట్ల మెజార్టీతో కె.ఎల్లప్ప గెలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. 7 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. జాయింట్ సెక్రటరీగా ఎం.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎస్.నతానియేల్ ఎన్నికయ్యారు. వీరితోపాటు డైరెక్టర్లుగా పీఎల్ ఆంజినేయులు, కె.ధన్‌రాజ్, జి.చంద్రమౌళి, వై.శ్రీనివాసులు, ఎం.షఫీవుల్లా, కె.నెట్టికల్లు గెలుపొందారు. అనంతరం మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పాలక వర్గానికి అభినందనలు తెలిపారు. టపాసులు పేలుస్తూ డప్పులు వాయిస్తూ రైల్వే ఇన్‌స్టిట్యూట్ నుంచి యూనియన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

గూగూడు ఆదాయం రూ.40,96,282

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాల సందర్భంగా దేవదాయ శాఖకు రూ.40,96,282 ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొహర్రం సందర్భంగా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు కుళ్లాయిస్వామి- ఆంజనేయస్వామిలను దర్శించుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా.. తాత్కాలిక హుండీల ద్వారా రూ.9,62,261, శాశ్వత హుండీల ద్వారా రూ.31,34,021 వచ్చినట్లు వెల్లడించారు.



గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు (ఫైల్)

చెలరేగుతున్న వడ్డీ మాఫియా

- నూటికి రూ.10 నుంచి రూ.40 వరకు వడ్డీ
- చెల్లింపుల్లో ఆలస్యమైతే దూషణలు, దాడులే
- శ్రుతిమించిపోతున్న వడ్డీ వ్యాపారుల ఆగడాలు



- ఈ నెల 7న అనంతపురంలోని పాతూరులో తిరుపాల్, ఆయన కుమారులు సూరి, శేషు ముగ్గురూ కలిసి బంగారు వ్యాపారస్తుడు అయిన బాబ్జాన్ అనే వ్యక్తిపై దారుణంగా దాడిచేశారు. తిరుపాల్ వద్ద నుంచి బాబ్జాన్ నూటికి రూ.10 వడ్డీ ప్రకారం రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. వడ్డీ రూపంలో ఇప్పటి వరకు దాదాపు రూ.10 లక్షలు చెల్లించాడు. ఈ నెల వడ్డీ డబ్బులు సాయంత్రం ఇస్తానని చెప్పినప్పటికీ అతనిపై తండ్రీ కుమారులు దాడి చేశారు. నగరంలోని మహల్దార్‌స్ట్రీట్, భవానీనగర్‌లో తిరుపాల్ దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయి.
- ఈ నెల 9న వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక బుక్కరాయసముద్రం ఐలమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బాషా అనే వ్యక్తి విషపుద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈయన రామాంజి అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.లక్ష అప్పు చేశాడు. రూ.100కు రూ.10 వడ్డీ చొప్పున మూడు నెలలు సక్రమంగా చెల్లించాడు. తర్వాత అసలు, వడ్డీ తక్షణమే చెల్లించాలని ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురై మహబూబ్ బాషా ఆత్మహత్యకు యత్నించినట్లు ఆయన భార్య ఫిర్యాదు చేశారు.
- ఈ నెల 15న వడ్డీ వ్యాపారుల నుంచి ప్రాణహాని ఉందని, తమను కాపాడాలని అనంతపురం అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న పి.వెంకట్రామిరెడ్డి, రేణుక దంపతులు ఎస్పీకి విన్నవించారు. తమ కుమారుడు అభిషేక్‌రెడ్డికి రూ.3.3 లక్షలు అప్పుగా ఇచ్చి.. రూ.5.60 లక్షలు కట్టించుకున్నారని, రూ.100కు వారానికి రూ.10 వడ్డీ చొప్పున తమకు తెలియకుండా తమ కుమారుడికి డబ్బు ఇచ్చి రికవరీ పేరిట పీడిస్తున్నారని తెలిపారు.

అనంతపురం: అవసరాలకు అప్పు చేయడం సహజం. అయితే ధర్మ వడ్డీకి అప్పులు చేస్తే పెద్దగా ఒత్తిడి ఉండదు. కానీ ఎక్కడా డబ్బు పుట్టలేదని, సర్దుబాటు కాలేదని అదనపు వడ్డీలకు అప్పులు ఇచ్చే వ్యాపారులను ఆశ్రయిస్తే ప్రాణాలకు ముప్పు పొంచినట్టే. డబ్బు వసూలులో వడ్డీ వ్యాపారులు మానవత్వం మరచి ప్రవర్తిస్తున్న తీరు ఆందోళన రేపుతోంది. జిల్లా కేంద్రం అనంతపురంలో కొందరు వ్యాపారులు 'మాఫియా'గా అవతారం ఎత్తారు. వాట్సాప్ గ్రూపు సృష్టించుకుని.. వడ్డీ ఇవ్వని వారి వివరాలు అందులో పేర్కొంటారు. వెంటనే అందరూ అక్కడికి చేరుకుని 'వడ్డీ ఎందుకు ఇవ్వవు' అంటూ భౌతికదాడికి తెగబడతారు. ఉద్యోగులు అప్పు చేస్తే.. వారి ఏటీఎంలు వడ్డీ వ్యాపారుల వద్ద ఉంచాల్సి వస్తోంది. అధిక వడ్డీ వ్యాపారులు తామిచ్చిన అప్పు కన్నా ఐదింతలు వడ్డీ రూపంలో తీసుకున్నా సరే.. ధన దాహం తీరదు. చెల్లింపులో ఎప్పుడైనా ఆలస్యమైతే రుణగ్రస్తుల బాధలు, కష్టాలు, పరిస్థితులను వినకుండా నిర్దయగా వ్యవహరిస్తున్నారు. పాతూరులో వడ్డీ వ్యాపారి తిరుపాల్ నడిరోడ్డులో బాబ్జాన్ అనే వ్యక్తిపై దౌర్జన్యం చేసిన ఘటన తర్వాత దాదాపు వంద మంది బాధితులు వడ్డీవ్యాపారి వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి ఫిర్యాదు చేశారు.

మామూళ్ల మత్తులో పోలీసులు

అనంతపురంలో భవానీ నగర్‌కు చెందిన ఓ సామాజిక వర్గం వారు నెలకు రూ.10 నుంచి రూ.40 వడ్డీలు వసూళ్లు చేస్తున్నారనే సంగతి అందరికీ తెలుసు. తలకు మించిన వడ్డీ భారం కట్టాలి. కట్టకపోతే అక్రమ కేసులు పెడతారు. కేసులు పెట్టించుకుని తమ కుటుంబ పరువు ఎందుకు పోగొట్టుకోవాలని సింహభాగం మంది లోలోన ఆవేదన చెందుతూ.. భారంగా వడ్డీలు కడుతున్నారు. ఒక్కసారి అప్పు చేసి ఊబిలోకి దిగితే.. బయటకు రావడం దాదాపు అసాధ్యమవుతోంది. వేలాది కుటుంబాలు ఈ అప్పుల బాధ తాళలేక చితికిపోయాయి. పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా మామూళ్లకు అలవాటుపడి ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి.

రూ.కోట్లకు పడగలెత్తిన వ్యాపారులు

నగరంలో వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిలో టీడీపీ నేతలు అధికంగా ఉన్నారు. వీరి వద్ద అప్పు తీసుకున్న వాళ్లు భయంతో వడ్డీల మీద వడ్డీలు చెల్లిస్తూ వీధిన పడుతున్నారు. పాతూరు, వినాయక్ నగర్, రాణినగర్, బుడ్డప్పనగర్, తదితర ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారమే వృత్తిగా ఎంతో మంది రూ.కోట్లకు పడగలెత్తడం గమనార్హం.

కొత్త సీఐ ఎప్పుడొస్తారో?

అనంతపురంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వడ్డీ వ్యాపారుల మాఫియా చెలరేగిపోతోంది. వడ్డీ వ్యాపారులు, మట్కా, గంజాయి బ్యాచ్ అధికంగా ఉండేది ఈ స్టేషన్ పరిధిలోనే. వీరి ఆగడాలను అరికట్టాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అయితే కొంతమంది పోలీసులు అసాంఘిక శక్తులకే సహకరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. జూన్ మొదటి వారం నుంచి సీఐ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటి వరకు ఉన్నతాధికారులు కొత్త సీఐని నియమించలేదు.

అధిక వడ్డీల కోసమే దాడులు

వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోయాయి. ఎంతలా అంటే పట్ట పగలే బహిరంగంగా దాడులు చేసేంత. పైకి కనిపించని దారుణాలు ఇంకా చాలా ఉన్నాయి. బాధితులు భయపడకుండా పోలీసుల స్టేషన్లను ఆశ్రయించాలి. అధిక వడ్డీ వ్యాపారస్తుల అరాచకాలను అడ్డుకోవడానికి బాధితుల పక్షాన అధిక వడ్డీల వ్యతిరేక పోరాట కమిటీ అండగా ఉంటుంది.

– సాకే హరి, అధిక వడ్డీల వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు

క్లుప్తంగా

ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా జరగాలి : డీపీఓ



పామిడిలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

పామిడి: ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ పక్కాగా జరగాలని పంచాయతీ సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఆదేశించారు. ఉదయం 7 గంటల్లోపే చెత్త సేకరణ చేపట్టి, ఫొటోలను ఎప్పటికప్పుడు డీపీఆర్‌సీ యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలని సూచించారు. శుక్రవారం పామిడి పంచాయతీ పరిధిలో ఆయన పర్యటించారు. పారిశుధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, మంచినీటి ట్యాంకుల నిర్వహణను తనిఖీ చేశారు. ఇంటింటి చెత్తసేకరణ, మంచినీటి సరఫరా, పారిశుధ్య పనులు, ఐవీఆర్‌ఎస్‌ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పామిడి మండలం వంకరాజుకాలువ పంచాయతీని తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రేఖ గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె పనితీరుపై గ్రామస్తులతో ఆరా తీశారు. విధి నిర్వహణలో ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుగా తెలుసుకుని షోకాజ్‌ నోటీసు జారీ చేశారు. డీపీఓ వెంట ఎంపీడీఓ కె.తేజోత్స్న, ఈఓఆర్డీ వై అశ్వత్థ నాయుడు, క్లాప్‌ మిత్రాలు ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడడం హేయం



నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు

తలుపుల: అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడును తాడిపత్రి మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకరరెడ్డి పరుష పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడడం హేయమని పంచాయతీ కార్యదర్శులు ఖండించారు. జేసీ ప్రభాకరరెడ్డి వైఖరిని తప్పు పడుతూ శుక్రవారం తలుపుల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నిబద్ధతతో పనిచేసే జిల్లా స్థాయి అధికారిపైనే ఇంతటి దౌర్జన్యం చేస్తున్న జేసీ ప్రభాకరరెడ్డి ఇక తన పరిధిలోని మండల, గ్రామస్థాయి అధికారులను ఎంతటి భయభ్రాంతులకు గురి చేస్తుంటారో ఊహించవచ్చన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జేసీ ప్రభాకరరెడ్డిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత తుంగపాలు

- హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల్లో ఇష్టారాజ్యం
- అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- ఇంకా కొనసాగుతున్న బ్రిడ్జిల నిర్మాణ పనులు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ల స్వార్థం... అధికారుల కమీషన్ల కక్కుర్తి కారణంగా ఇప్పటి వరకు పనులు పూర్తి నాసిరకంగా జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. రెండ్రోజుల్లోనే పనులు ముగించేస్తే ఆ తర్వాత నీళ్లొచ్చేస్తాయని, ఇక నాణ్యత గురించి అడిగేదెవరనే ధీమా కాంట్రాక్టర్లు, అధికారుల్లో వ్యక్తమవుతోంది.



ఉద్దేహాళ్‌-మల్లికేతి మధ్యలో 115-167 కిలోమీటర్‌ వద్ద కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు



నాగలాపురం వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండగా కాలువలో ప్రవహిస్తున్న నీరు

బొమ్మనహాళ్‌/కణేకల్లు: జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న హెచ్చెల్సీపై ఇటు రైతులు.. అటు ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సాగునీటితోపాటు జిల్లా ప్రజల దాహార్తిని ఈ ప్రాజెక్ట్‌ తీర్చుతోంది. అయితే రూ.35.06 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులు నాసిరకంగా సాగుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు ఈ ఏడాది మార్చి నెలలో టెండర్లు నిర్వహించారు. అగ్రిమెంట్ల ప్రక్రియ ముగిసిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఈ పాటికి వంద శాతం పనులు పూర్తయ్యేవి. అయితే ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పనులు ప్రారంభించే విషయంలో కాంట్రాక్టర్లు అనవసరంగా కాలయాపన చేశారు. చేపట్టిన పనులు కూడా నత్తనడకన కొనసాగిస్తూ వచ్చారు. కనీసం చేసిన పనులైనా నాణ్యతతో ఉన్నాయంటే అది కూడా లేదు. హెచ్చెల్సీ లైనింగ్‌, యూటీ, కాలువలో కాంక్రీట్‌ బెడ్డింగ్‌ పనులు నాసికరంగా జరిగాయి.

48 గంటల్లోనే బయట పడిన పనుల్లో డొల్లతనం

హెచ్చెల్సీ లైనింగ్‌ పనులు పూర్తి నాసిరకంగా జరిగాయి. మైలాపురం, నాగలాపురం, యర్రగుంట యూటీ వద్ద చేపట్టిన లైనింగ్‌ పనుల్లో నాణ్యత డొల్లతనం కేవలం 48 గంటల్లోనే బయట పడింది. పూర్తయిన పనుల్లో ఇసుక, కంకర తేలి అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తి చూపుతున్నాయి. పనుల్లో ఎటు చూసినా హెచ్చుతగ్గులు... ఇసుక ప్యాచ్‌లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మైలాపురం వద్ద గతంలో కాలువకు గండి పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆ ప్రాంతంలో పూర్తయిన పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా అవగతమవుతోంది. నిబంధనల ప్రకారం ఎర్రమట్టితో కాలువ గట్టును పూడ్చి బాగా గట్టు పటిష్టపడేలా రోలింగ్‌ చేయాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా కట్టకు సమాంతరంగా ఎర్రమట్టి పోసి వదిలేశారు. కాలువ గట్టు బలోపేతానికి నాణ్యమైన ఎర్రమట్టిని వాడాల్సి ఉండగా, లూజ్‌ సాయిల్‌ వేసి వాడి పడేసిన పాత రాళ్లను పరిచి పనులు ముగించేశారు. నాణ్యత లేని కారణంగా భవిష్యత్తులో పగుళ్లు ఏర్పడే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. లైనింగ్‌కు ఉపయోగించే సిమెంట్‌ కాంక్రీట్‌ మిశ్రమంలో ఇసుక, కంకర ఎక్కువ వాడి సిమెంట్‌ తక్కువ వేశారని అంటున్నారు.

కనిపించని అధికారులు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లు పనుల వద్ద కన్పించకుండాపోయారు. హెచ్చెల్సీ ఎస్‌ఈ, ఈఈలు విధిగా పనులు జరిగేచోట ఏఈఈలను నియమించినా వారు మాత్రం ఉండకుండా పోవడం గమనార్హం. ముఖ్యమైన పనులుంటే ఫోన్‌లోనే ఆదేశాలిచ్చి పనులు సాగేలా చేశారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆధునికీరణ పనుల్లో కాంట్రాక్టర్లు ఆడిందే ఆట... పాడిందే పాటగా సాగింది.

ప్రారంభం కాని కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్‌ రెగ్యులేటర్‌

కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్‌ రెగ్యులేటర్‌ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుతం హెచ్చెల్సీకి నీరు రావడంతో ఈ పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. హెచ్చెల్సీకి నీటి సరఫరా బంద్‌ అయిన తర్వాత అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

నీళ్లొస్తున్నా... కొనసాగుతున్న పనులు

హెచ్చెల్సీకి ఈ నెల 10న నీటిని విడుదల చేశారు. బొమ్మనహాళ్‌ మండల పరిధిలోని హెచ్చెల్సీలో అత్యవసర మరమ్మతు పనుల నేపథ్యంలో సరిహద్దులోని 105వ కిలోమీటర్‌ వద్ద ఆంధ్రలోకి నీరు రాకుండా గేట్లు కిందకు దింపారు. ఉద్దేహాళ్‌-మల్లికేతి బ్రిడ్జి, నాగలాపురం బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద మట్టిని తొలగించడంతో శుక్రవారం మధ్యాహ్నం సరిహద్దులో దింపిన గేట్లను హెచ్చెల్సీ అధికారులు ఎత్తి నీటిని వదిలారు. ప్రస్తుతం సరిహద్దులో 300 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఓ వైపు కాలువలో నీరు ప్రవహిస్తుండగా మరోవైపు పనుల్లో కాంట్రాక్టర్ల హడావుడి కన్పించింది. లైనింగ్‌, కాలువగట్ల పటిష్టత పనులు చేస్తూనే ఉన్నారు. ఉద్దేహాళ్‌-మల్లికేతి బ్రిడ్జి, నాగలాపురం బ్రిడ్జి పనుల వద్ద నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా ఓ వైపు వదిలి, మరో వైపు అడ్డుకట్ట వేసి బ్రిడ్జి పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యేందుకు వారం రోజులు సమయం పడుతుందని సమాచారం.

టీచర్లకు హ్యాండ్‌ బుక్స్‌ సరఫరా



వాహనంలోకి లోడ్‌ చేస్తున్న హ్యాండ్‌ బుక్స్‌

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడానికి, పిల్లలకు పాఠాలను సులభంగా అర్థమయ్యేలా బోధించడానికి ఉపయోగపడే 'హ్యాండ్‌ బుక్స్‌'ను శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి మండలాలకు సరఫరా చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) ద్వారా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి మండలాలకు తరలించారు. డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఒక సబ్జెక్టుకు ఒక బుక్‌ చొప్పున పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు. ఎఫ్‌పీఎస్‌ 1, 2 తరగతుల స్కూళ్లకు 6 , 1-5 తరగతుల బీపీఎస్‌ స్కూళ్లకు 18, ఉన్నత పాఠశాలలు 6-10 తరగతులకు 33, ఉన్నత పాఠశాలలు 1-10 తరగతులకు 51 చొప్పున కేటాయించినట్లు శ్రీనివాసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,729 పాఠశాలలకు 39,569 హ్యాండ్‌ బుక్స్‌ సరఫరా చేశామన్నారు. శనివారం ఉదయం మండలాల నుంచి ఆయా పాఠశాలలకు చేర్చాల్సిన బాధ్యత ఎంఈఓలదేనన్నారు. అదే రోజు మధ్యాహ్నం జరిగే స్కూల్‌ కాంప్లెక్స్‌ సమావేశాలకు ఈ హ్యాండ్‌ బుక్స్‌తో టీచర్లు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

సీపీఎస్‌ రద్దు చేయాలి

- కలెక్టరేట్‌ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు

అనంతపురం అర్బన్‌: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సీపీఎస్‌ రద్దు చేసి పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని నాయకులు డిమాండ్‌ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌ ఎదుట డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరమ్‌ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఫోరమ్‌ రాష్ట్ర కన్వీనర్‌ మధుప్రసాద్‌ మాట్లాడుతూ.. సీపీఎస్‌ అమలు తేదీ 2004, సెప్టెంబరు 1వ తేదీకి ముందే నోటిఫికేషన్‌ వెలువడి, పరిపాలన, తదితర కారణాలతో సీపీఎస్‌ అమలు తేదీ తర్వాత విధుల్లోకి చేరిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ వర్తించకుండా పోయిందన్నారు. వీరికి పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే మెమో ప్రకారం ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు అక్కడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ విధానం అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. మెమో 57కు అనుగుణంగా వివిధ శాఖల్లో విధుల్లోకి చేరిన ఉద్యోగుల వివరాలను సేకరించి సిద్ధం చేసిన ఫైలు ఆర్థిక శాఖలో ఏడాదిగా పెండింగ్‌లోనే ఉందన్నారు. ముగ్గురు ఐఏఎస్‌ అధికారులకు మెమో 57 అమలు చేశారని, దిగువస్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పోలీసులకు అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌ పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్‌ వినోద్‌కుమార్‌ను నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా కన్వీనర్లు మారుతీప్రసాద్‌, నాగభూషణం, కట్టయ్య, మధుకుమార్‌, ప్రసన్నలక్ష్మి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు. ఫోరం చేపట్టిన ధర్నాకు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు ఇస్తూ పాల్గొన్నారు.

అహుడా పరిధిలో ల్యాండ్‌ బ్యాంక్‌ గుర్తించండి



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

అనంతపురం అర్బన్‌: అహుడా పరిధిలో ల్యాండ్‌ బ్యాంక్‌ గుర్తించాలని సంబంధిత అధికారులను పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ వినోద్‌కుమార్‌, అహుడా చైర్మన్‌ టీసీ వరుణ్‌, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌, అలిమినేని సురేంద్రబాబు, రాష్ట్ర కార్మిక సంక్షేమబోర్డు చైర్మన్‌ వెంకటశివుడు యాదవ్‌తో కలిసి అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎంఐజీ లే అవుట్లను అభివృద్ధి చేసి ప్రజలకు కేటాయించాలన్నారు. కళ్యాణదుర్గం పరిధిలోని ఎస్సీ కాలనీల అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామన్నారు. అవసరమైన చోట డిప్యుటేషన్‌ ద్వారా నియమాకాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎఫ్‌ఎస్‌ఓ రామకృష్ణారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్‌ బాలస్వామి, ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ, నగర పాలక సంస్థ ఈఈ షాకీర్‌, టిడ్కో ఈఈ సుధారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్‌ 2 నాటికి చెత్త దంపులన్నీ తొలగిస్తాం

అనంతపురం కార్పొరేషన్‌: రాష్ట్రంలో డంపింగ్‌ యార్డుల్లో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోగా 55 లక్షల టన్నులను తొలగించామని, ఈ ఏడాది అక్టోబర్‌ 2 కల్లా దంపులన్నీ క్లియర్‌ చేస్తామని మంత్రి పి.నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన అనంతపురంలోని గుత్తి రోడ్డు కంపోస్టు యార్డులో రూ.12.21 కోట్లతో చేపట్టిన బయో రెమిడేషన్‌, బయోమైనింగ్‌ పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి, మాట్లాడారు. రెండేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్‌ ఇస్తామన్నారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి కేంద్రం వాటాతో పాటు అదే రోజునే రాష్ట్ర వాటా కలిపి ఇస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు.

హోంగార్డు కుటుంబాలకు చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగదీష్‌

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో గత నెల వేర్వేరు కారణాలతో మృతి చెందిన ముగ్గురు హోంగార్డులకు సంబంధించి వారి కుటుంబాలకు ఎస్పీ పి.జగదీష్‌ శుక్రవారం ఆర్థిక చేయూతనందించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన హోంగార్డు బి.తిరుపాల్‌నాయక్‌ కుటుంబానికి జిల్లా హోంగార్డుల ఒక్క రోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తం రూ.4,33,200తో పాటు ఫ్లాగ్‌ ఫండ్‌ కింద రూ.10 వేలు, అనంతపురం జిల్లాలో పని చేస్తూ మరణించిన లక్ష్మీరెడ్డి కుటుంబానికి ఫ్లాగ్‌ ఫండ్‌ కింద రూ.10 వేలు, శ్రీసత్యసాయి జిల్లా హోంగార్డుగా పనిచేస్తూ చనిపోయిన నరసింహులు కుటుంబానికి ఫ్లాగ్‌ ఫండ్‌ కింద రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్‌ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్లు పవన్‌కుమార్‌, రాముడు, ఆర్‌ఎస్‌ఐ జాఫర్‌, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్ష షెడ్యూల్‌ మార్పు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ప్రీ పీహెచ్‌డీ పరీక్ష షెడ్యూల్‌ను మార్పు చేశారు. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ఎవాల్యుయేషన్స్‌ ప్రొఫెసర్‌ జి. వెంకటరమణ శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహించాల్సిన ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ఆగస్టు 5, 6, 7వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఏపీపీఎస్సీ డిగ్రీ లెక్చరర్ల రాత పరీక్ష నేపథ్యంలో ఈ మార్పు చేశారు. ఆగస్టు 5వ తేదీ రీసెర్చ్‌ మెథడాలజీ (పేపర్‌-1), 6న అడ్వాన్స్డ్‌ సబ్జెక్టు పేపర్‌/రీసెంట్‌ అడ్వాన్సెస్‌ ఇన్‌ ద సబ్జెక్టు(పేపర్‌-2), 7న పేపర్‌ ఆన్‌ రీసెర్చ్‌ ఏరియా (పేపర్‌-3) పరీక్షలు జరుగుతాయి. ప్రతి పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు.

'అనంత' భూముల్లో పోషకాల లోపం

- సేంద్రియ కర్బనం, నత్రజని, జింక్‌ సల్ఫేట్‌ పోషక శాతం తక్కువ
- భూసార పరీక్షలను పరిశీలించిన జేడీఏ ఉమామహేశ్వరమ్మ



ప్రయోగశాలలో భూసార పరీక్షల తీరును తెలుసుకుంటున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్‌: గత కొన్నేళ్లుగా అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం కారణంగా జిల్లా భూములు చాలా వరకు నిస్సారంగా మారుతున్నాయని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక భూసార పరీక్షా ప్రయోగశాల (సాయిల్‌ టెస్టింగ్‌ ల్యాబొరేటరీ-ఎస్‌టీఎల్‌)ను ఆమె సందర్శించారు. అక్కడ చేపట్టిన మట్టి పరీక్షల గురించి ఏడీఏ రోజాపుష్పలతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేడీఏ మాట్లాడారు. గతేడాది చేసిన మట్టి పరీక్షలు, వాటి ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే... 'అనంత' భూముల్లో అత్యంత కీలకమైన సేంద్రియ కర్బనం (ఆర్గానిక్‌ కర్బన్‌) శాతం క్షీణించిపోయిందన్నారు. దాదాపు అన్ని మట్టి పరీక్షల్లోనూ కర్బనం శాతం చాలా తక్కువగా ఉన్నట్లు వెల్లడైందన్నారు. దీంతో పాటు నత్రజని (నైట్రోజన్‌), అలాగే జింక్‌సల్ఫేట్‌ లాంటి సూక్ష్మపోషకాల లోపం (మైక్రో న్యూట్రియంట్‌ డెఫిసెన్సీ) కూడా ఎక్కువగా ఉందన్నారు. పొటాష్‌ శాతం మాత్రం సాధారణం కన్నా అధికంగానే ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సేంద్రియ కర్బన శాతం పెంచుకునే చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం పశువుల ఎరువు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఎరువు, వర్మీకంపోస్టు లాంటివి వేసుకోవాలని సూచించారు. వీటితో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ లాంటి గ్రీన్‌మెన్యూర్‌ (పచ్చిరొట్ట ఎరువుల) వాడకం పెరగాలన్నారు. ఈ పంటలు వేసుకుని కలియదున్నితే భూసారం గణనీయంగా పెరుగుతుందన్నారు. అలాగే వేప, కానుగ, జిల్లేడు లాంటి వృక్ష సంబంధిత పోషకాలు, బయో ఫర్టిలైజర్స్‌ వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని ఎక్కువగా వాడితే భూమి గుల్లబారడమే కాకుండా పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని తెలిపారు. వీటిపై రైతుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అక్కడే ఉన్న క్రిమిసంహారక మందుల పరీక్షా ప్రయోగశాల (పెస్టిసైడ్‌ టెస్టింగ్‌ ల్యాబ్‌-పీటీఏల్‌)ను సందర్శించి అక్కడ జరుగుతున్న పరీక్షల గురించి ఏడీఏ హైమావతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనాథరెడ్డి, శేఖర్‌రెడ్డి, నివేదిత, మెహన్‌తాజ్‌, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ పనులు వేగవంతం చేయండి

- శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌



హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ పనులపై సమీక్షిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌

ప్రశాంతి నిలయం: హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌) పథకం పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ ఆదేశించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ పనులపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో సమీక్షించారు. జిల్లా పరిధిలోని పనులను మూడు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని, అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేయాలన్నారు. టన్నెల్‌ మట్టి పనులు నెలాఖరులోపు పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. లైనింగ్‌, టన్నెల్‌తో పాటు బెడ్‌ వర్క్‌ పనులన్నీ ఆగస్టు 20వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ కెనాల్‌కు భూసేకరణ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యుత్‌ స్తంభాల మార్పుపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. సమావేశంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ ఈఈ రాజా స్వరూప్‌కుమార్‌, ఈఈలు మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు శెట్టి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ భూసేకరణ విభాగం అధికారి ఇంతియాజ్‌, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



అశోక్‌ (ఫైల్‌)

గుంతకల్లు రూరల్‌: మండలంలోని పాతకొత్తచెరువు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని తిలక్‌నగర్‌కు చెందిన సుబ్బరాయుడు, తన కుమారుడు అశోక్‌ (20)తో కలసి కూరగాయల మార్కెట్‌లో ఆకుకూరల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన తన స్నేహితుడు సాయితో కలసి శుక్రవారం తన ద్విచక్ర వాహనంలో వెళ్లిన అశోక్‌.. మధ్యాహ్నం గుంతకల్లుకు తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పాతకొత్తచెరువు మసీదు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో తలకు తీవ్రగాయమై అశోక్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. స్వల్పగాయాలతో సాయి బయట పడ్డాడు. ఘటనపై గుంతకల్లు రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుడు ఇస్మాయిల్‌

రాయదుర్గం టౌన్‌: విద్యుత్‌ షాక్‌కు గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం కలుగోడు గ్రామానికి చెందిన కొలిమి ఇస్మాయిల్‌ (42)కు భార్య ఖుర్షీద్‌, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. భవన నిర్మాణ రంగంలో మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో రాయదుర్గంలోని మారెమ్మ గుడికి వెళ్లే దారిలో హర్ష అనే వ్యక్తికి చెందిన ఇంటిపై అంతస్తు నిర్మాణంలో భాగంగా శుక్రవారం గోడకు ప్లాస్టింగ్‌ చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో వచ్చిన ఫోన్‌ కాల్‌ రిసీవ్‌ చేసుకుని చేతులు గాలిలోకి ఊపుతూ మాట్లాడడంతో పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్‌ లైన్‌ తగిలి షాక్‌కు గురై కిందపడ్డాడు. గమనించి తోటి కూలీలు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడు రూరల్‌: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్‌ మండలం రాచానపల్లికి చెందిన రామప్ప (47), రామాంజనమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రైవేట్‌ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రామప్ప కొంత కాలం క్రితం సెల్యులైటిస్‌ వ్యాధి బారిన పడ్డాడు. ఎడమకాలు మోకాలి నుంచి కింద పాదం వరకూ బాగా దెబ్బతినింది. చాలాచోట్ల చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఫినాయిల్‌ తాగాడు. అపస్మారక స్థితిలో చేరుకున్న రామప్పను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్‌టీఎల్‌కు 'ఎన్‌ఏబీఎల్‌' గుర్తింపు

అనంతపురం అగ్రికల్చర్‌: స్థానిక భూసార పరీక్షా ప్రయోగశాల (సాయిల్‌ టెస్టింగ్‌ ల్యాబొరేటరీ - ఎస్‌టీఎల్‌)కు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఏబీఎల్‌ (నేషనల్‌ అక్రిడిటేషన్‌ బోర్డ్‌ ఫర్‌ టెస్టింగ్‌ అండ్‌ కాలిబ్రేషన్‌ లాబొరేటరీస్‌) గుర్తింపు దక్కినట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక భూసార పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఎన్‌ఏబీఎల్‌ అక్రిడిటేషన్‌ను ఆమెకు ఎస్‌టీఎల్‌ ఏడీఏ రోజాపుష్పలత చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ప్రయోగశాలలు ఉండగా అనంతపురంతో పాటు గుంటూరు, గొల్లపూడి, ఆముదాలవలసలోని ప్రయోగశాలలకు అక్రిడిటేషన్‌ దక్కిందన్నారు. ఈ గుర్తింపు 2028 వరకు ఉంటుందన్నారు. మట్టి సేకరణ, వాటి ద్వారా స్థూల, సూక్ష్మపోషకాల శాతం తెలుసుకునేందుకు 12 రకాల పరీక్షలు నిర్వహించడం, వాటిని ఆన్‌లైన్‌ చేయడం, వాటి ఫలితాలను సకాలంలో రైతులకు అందించడం, అలాగే లక్ష్యం మేరకు పరీక్షలు పూర్తీ చేయడం, కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పన, మానవ వనరుల లభ్యత తదితర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌ఏబీఎల్‌ అధికారులు అక్రిడిటేషన్‌ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా 25 వేల మట్టి పరీక్షలు చేయాలని లక్ష్యంతో ఉన్నామని, ఇప్పటికే 17,750 వరకు మట్టి శ్యాంపిల్స్‌ ప్రయోగశాలకు చేరగా.. పరీక్షలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.

21న జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఎంఎన్‌సీ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీలో పార్ట్‌టైం, ఫుల్‌టైం ఉద్యోగాల కోసం ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు అనంతపురం జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జాబ్‌ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనాధికారి పల్లవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొత్తం 43 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు. జీతం రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది. ఎంపికైన వారు అనంతపురంలో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు బయోడేటా ఫారం, విద్యార్హత ఒరిజినల్‌, జిరాక్స్‌ పత్రాలు, ఆధార్‌, బ్యాంకు అకౌంట్‌, పాన్‌కార్డు వెంట తీసుకెళ్లాలి.

కాంట్రాక్ట్‌ అధ్యాపకులూ.. రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్‌: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 19 లోపు రెన్యువల్‌ కోసం ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు అనంతపురం ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ పద్మశ్రీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత విద్యా సంవత్సరం ఏప్రిల్‌ 30 వరకు పని చేసిన వారు మాత్రమే అర్హులు. దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లు జత చేయాలి. కళాశాల విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా రెన్యువల్‌ చేయనున్నారు.

క్లుప్తంగా

వీఆర్వోలకు వీడ్కోలు



బదిలీ అయిన వీఆర్వోలను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్ల, వేపచెర్ల గ్రామాల వీఆర్వోలు రఫీ, రామాంజి బదిలీ కావడంతో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మీనాయక్, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ తదితరులు బదిలీ అయిన వీఆర్వోలకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. బదిలీలు సహజమని.. ఎక్కడ పని చేసినా గుర్తింపు ముఖ్యమని తహసీల్దార్ తెలిపారు.

గాలి భానుప్రకాష్ వ్యాఖ్యలు దారుణం

ఆత్మకూరు: మాజీ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ హేమలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల నెల్లూరులో నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఏదో అన్నారని మహిళా కమిషన్ ఆఘమేఘాలపై స్పందించిందన్నారు. మరి రోజాను ఇంతదారుణంగా తిట్టిన భాను ప్రకాష్ విషయంలో ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమో.. ఆడవాళ్లను ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడితే అదే వారికి ఆఖరి రోజు అని వార్నింగ్ ఇచ్చారు. మరి ఇప్పుడు ఏం సమాధానం చెప్తారన్నారు. పవన్ కల్యాణ్ కళ్లుమూసుకున్నారా? అని ప్రశ్నించారు. అనుచిత వ్యాఖ్యలపై హోంమంత్రి నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. మహిళలను దూషిస్తే వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

అనంతపురం: అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపల్, పట్టణాలు, మండల కేంద్రాల్లోని కూడళ్లు, జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకెన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోసైడ్‌సిట్టింగ్, డెఫెక్టివ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనలకు జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు.

న్యాయవాది ఇంట్లో చోరీ

అనంతపురం: నగరంలోని మారుతీనగర్‌లో నివాసముంటున్న న్యాయవాది మల్లెల శశికళ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. రోజూ ఉదయం 9:30 గంటలకు కోర్టు విధులకు ఆమె హాజరవుతుంటారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి చేరుకుంటారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు మ్యాక్ ఇన్సూరెన్స్ కంపెనీకి వెళ్లిన ఆమె మధ్యాహ్నం 1:21 గంటకు సీసీ కెమెరా డివైజ్ ఆఫ్ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. 2:20 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా, తలుపులకున్న సెంట్రల్ లాక్‌ను ధ్వంసమై ఉన్నాయి. సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లు కట్ చేసి ఉన్నాయి. బెడ్‌రూం వస్తువులన్నీ చెల్లాచెదురు అయ్యాయి. బీరువాలోని బంగారు గాజులు, బంగారు చైను, ఒక జత బంగారు బుట్ట కమ్మలు, పాత బంగారు చైను, ఒక జత చిన్న పిల్లల ఉంగరాలు, రెండు బంగారు తాళి బొట్లు, బంగారు ఉంగరం మొత్తం 80 గ్రాములతో పాటు యాపిల్ వాచ్, యాపిల్ ఐప్యాడ్ వస్తువులు అపహరించినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉద్యమ బాటలో నడవాలి



వీకే ఆదినారాయణరెడ్డి స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు అగ్రనేత వీకే ఆదినారాయణ రెడ్డి పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తి అని సీపీఐ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక కేంద్రీయ ఉద్యానవనం వద్ద ఉన్న ఆదినారాయణ రెడ్డి స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి సాధన, రాయలసీమలో మానవ హక్కుల కోసం పోరాటాలు ఆయన జీవితంలో కీలక ఘట్టాలన్నారు. వ్యవసాయ కార్మిక ఉద్యమాలకు రూపకర్త అన్నారు. ఆయన పోరాటాలను కార్యకర్తలు స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమ బాటలో నడవాలన్నారు. నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, నాయకులు లింగమయ్య, పద్మావతి, పార్వతి ప్రసాద్, రమణ, అల్లీపీరా, రాజేష్, కృష్ణుడు, చిరంజీవి, జయలక్ష్మి, ఈడిగ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం పేరుతో దోపిడీ

అన్ని జబ్బులకు వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీలు

- ల్యాబ్ టెక్నీషియన్లతో కుమ్మక్కై దోచుకుంటున్న వైనం
- అనారోగ్యంగా ఉందని వెళ్తే వేల రూపాయల బిల్లు
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన



ఆత్మకూరు: పల్లె ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆర్ఎంపీలు దోచుకుంటున్నారు. వృత్తిలో ఏమాత్రం అనుభవం, అర్హత లేకున్నా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండలంలోని చుట్టు పక్కన గ్రామాల నుంచి ఎవరైనా అనారోగ్యంగా ఉందని మండల కేంద్రంలోని ఆర్ఎంపీల వద్దకు వెళ్తే అంతే సంగతులు. వైద్యం పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏదైనా గాయం అయితే కట్టుకట్టి పంపించాల్సిన ఆర్ఎంపీలు.. నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. అన్ని జబ్బులకు ఇక్కడే వైద్య చికిత్సలు అందిస్తున్నారు. మండల వ్యాప్తంగా 17 పంచాయతీల్లో దాదాపు 20 మందికి పైగా ఆర్ఎంపీలు ఉన్నారు.

వేలకు వేలు దోచుకుంటూ..

ఇటీవల ఓ వ్యక్తి తనకు అనార్యోంగా ఉందని ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్తే అతను చికిత్స చేసి ఏకంగా రూ.2,200 బిల్లు వేశారు. అదే విధంగా ఓ చిన్నారికి ఏదో తెలిసిన వైద్యం చేసి రెండు టానిక్ బాటిల్స్ అందజేసి, రూ.500 బిల్లు తీసుకున్నారు. రోగుల జేబు ఖాళీ చేసి బయటకు పంపుతున్నారు. ఇలా చిన్న చిన్న జబ్బులకు కూడా వేలకు వేలు దోచుకుంటే ఎలా అంటూ ఆర్ఎంపీలపై ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల కోసం కక్కుర్తి..

మండల కేంద్రంలో ఉన్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఆర్ఎంపీలు కుమ్మక్కై ప్రజలను దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనారోగ్యంగా ఉందని డాక్టర్ వద్దకు వెళ్తే.. రక్త, మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయాలని చెబుతూ ల్యాబ్ టెక్నీషియన్ల వద్దకు పంపుతున్నారు. ఇదే అదునుగా ల్యాబ్ టెక్నీషియన్లు కూడా లేనిపోని పరీక్షలు చేసి వేలల్లో బిల్లు చేస్తున్నారు. ఆ బిల్లులో ఆర్ఎంపీల కమీషన్లు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా చాలా మంది ఆర్ఎంపీలు మందులు, గ్లూకోజ్ బాటిల్స్ విక్రయిస్తున్నారు. చిన్న జర్వానికి సైతం సెలైన్ బాటిల్ పెట్టి డబ్బు దండుకుంటున్నారు. జిల్లా స్థాయి వైద్య అధికారులు స్పందించి రోగులను దోచుకుంటున్న ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం



ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. అన్ని జబ్బులకు చికిత్సలు అందిస్తున్నాం. చిన్న చిన్న రోగాలకు వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన అవసరం లేదు. అనార్యోగానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేయించుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కూడా ఉచితంగా అందజేస్తారు. – నబీహా సుల్తానా, డాక్టర్

శాకంబరిగా అమ్మవారి దర్శనం



అలంకరణలో జగదీశ్వరాలయంలోని ప్రసన్న పార్వతీమాత



సోమనాథ నగర్‌లో దుర్గామాతగా సీతమ్మ

అనంతపురం కల్చరల్: ఆషాఢంలో వచ్చిన చివరి శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. సోమనాథ నగర్‌లోని కోదండ రామాలయంలో మణూరు నాగరాజు బృందం సీతాదేవిని దుర్గామాతగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. తపోవనంలోని జగదీశ్వరాలయంలో ప్రసన్న పార్వతీమాత శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చింది. చిన్మయా మిషన్ జిల్లా ఇన్‌చార్జి స్వామి ఆత్మవిదానంద సరస్వతి ఆషాఢమాస విశిష్టతను తెలియజేశారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ దేవతను కార్పొరేటర్ గురుశేఖరబాబు నేతృత్వంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరించి పూజలు జరిపించారు. అలాగే శివకోటి, శ్రీశివబాలయోగి ఆశ్రమం, శ్రీవలిస్వామి ఆశ్రమం, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, శంకరమఠం తదితర చోట్ల చివరి శుక్రవారం పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. వాడవాడలా అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చింది.


ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరుల వాహనాలు, ఇళ్లపై దాడులు జరుగుతున్నాయి. ప్రశ్నిస్తే దాడి చేసి, కేసులు పెడతారా సునీతమ్మా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, యూత్ కన్వీనర్ మణికంఠ, జేఏసీ కన్వీనర్ వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సర కాలంగా రామగిరి మండలం రావణకాష్టంగా మారిందన్నారు. ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాగా భద్రతా వైఫల్యంతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు వంద మందిపై కేసులు పెట్టింది మీరు కాదా అన్నారు. రామగిరి ఎంపీపీపై కన్నేసి మూడు సార్లు వాయిదా పడేందుకు టీడీపీ నాయకులే కారణమన్నారు. పార్టీలకతీతంగా న్యాయం చేసేందుకు ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు.

అలరించిన 'శకుని' నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలోని ఓ సన్నివేశం

అనంతపురం కల్చరల్: అనంత తరఫున నంది నాటకోత్సవాల్లో పోటీపడుతున్న 'శకుని' పౌరాణిక నాటక ప్రదర్శన శుక్రవారం రాత్రి లలిత కళాపరిషత్తులో జరిగింది. పరిషత్తు కార్యదర్శి పద్మజ నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు సీనియర్ రంగస్థల నటులు, ఎల్కేపీ కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. గతంలో గాజుల నారాయణ స్వామి నేతృత్వంలో జిల్లాకు తొలిసారి 'సతీసావిత్రి' నాటకానికి నంది అవార్డులు వచ్చాయని తెలిపారు. మరోసారి శకుని అదేవిధమైన ప్రతిభతో నాటకోత్సవాల్లో ఆకట్టుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కీర్తిని పెంచే విధంగా ఉత్తమ సాంకేతిక నైపుణ్యంతో, సీనియర్ నటీనటుల నటనా కౌశలంతో సాగిన నాటకం మంత్రముగ్ధులను చేసింది. శకుని పాత్రధారి రాజకుళ్లయప్పతో పాటూ నటీనటులు అద్భుత హావభావాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, అహూడా చైర్మన్ వరుణ్, ఆచార్య సుధాకరబాబు, ఆనంద్, సోమిరెడ్డి, రామగోవిందు, అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?



ప్యాదిండి వాల్మీకి విగ్రహం సమీపంలో నిలిచిన నీరు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి గ్రామంలో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి అపరిశుభ్రత నెలకొంది. ప్యాదిండి నుంచి ధర్మవరం వెళ్లే దారిలో స్థానిక వాల్మీకి విగ్రహం సమీపంలో నీరు నిలవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు పెరగడంతో జ్వరాలు సోకే అవకాశం లేకపోలేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని దోమలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వర్మీ కంపోస్టు తయారు చేయాలి




ముక్తాపురంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

కనగానపల్లి: గ్రామాల్లో విరివిగా పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రతను కాపాడాలని పంచాయతీరాజ్ సిబ్బందిని ఆర్ఏఓ జనార్దన్ ఆదేశించారు. మండలంలోని ముక్తాపురం గ్రామంలో శుక్రవారం ఆయన డీఎల్‌పీఓ శివకుమారితో కలసి పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామంలో క్రమం తప్పకుండా రోజు చెత్తను సేకరించి ఒకచోట డంపింగ్ చేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, పంచాయతీ కారదర్శి సుధాకర్ రెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..!

- ప్రొటోకాల్ పాటించని వ్యవసాయ శాఖ సిబ్బంది



ప్రభుత్వం సరఫరా చేసిన కందులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంత మంది కింద స్థాయి వ్యవసాయ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ పార్టీ నాయకుల కన్నా దారుణంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏదైనా కార్యక్రమం నిర్వహించాల్సి వస్తే ప్రొటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదు. ఇటీవల రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మండలంలోని 10 రైతు భరోసా కేంద్రాలకు 56 క్వింటాళ్ల కందులు వచ్చాయి. అయితే ఈ విషయాన్ని కూడా ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లలేదు. ఈ కందులను మొదటగా ఎస్సీ, ఎస్టీ రైతులకు అందజేయాల్సి ఉన్నప్పటికీ తమకు అనుకూలంగా ఉన్న వారికి అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాట్సాప్ గ్రూప్‌ల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల తొలగింపు

మండలంలో కొన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలపై తెలియజేసేందుకు రైతులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఏ సమాచారం వచ్చినా సిబ్బంది ఆ గ్రూప్స్‌లో పోస్టు చేస్తుంటారు. అయితే ఇటీవల మాత్రం కొంత మంది కింద స్థాయి వ్యవసాయ సిబ్బంది వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉన్న వారిని వాట్సాప్ గ్రూప్‌ల నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. రైతుల విషయాల్లో కూడా ఇలా రాజకీయాలు చేస్తే ఎలా అంటూ ప్రజలు మండిపడుతున్నారు.

సాంకేతిక పద్ధతుల ద్వారా పరిశోధన



క్షేత్రస్థాయి పర్యటనలో శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు సాంకేతిక పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు చేయాలని తిరుపతి ప్రిన్సిపల్ సైటింటిస్ట్ డాక్టర్ రమణ సూచించారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధునాతన సాంకేతిక పద్ధతుల గురించి రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతులకు సులభ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. పరిశోధనల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతుల ద్వారా సమగ్ర పురుగుల యాజమాన్యంపై కీటక విభాగం ప్రిన్సిపల్ సైంటిస్ట్ తిరుపతి డాక్టర్ మురళీకృష్ణ వివరించారు. మార్కెటింగ్, ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై విస్తరణ శాస్త్రవేత్త తిరుపతి డాక్టర్ మోహన్ వివరించారు. కార్యక్రమలంలో డాక్టర్ ప్రశాంతి డాక్టర్ పి.స్వామి, రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, అసోసియేట్ డైరెక్టర్ జాన్సన్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగేలా చూడాలి



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు

అనంతపురం అర్బన్: పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలు కొనసాగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సేవ్ ఆర్డీటీ నినాదంతో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్ నుంచి కలెక్టరేట్ సమీపంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్ చేరుకుని గేటు ముందు నిరసన తెలిపారు. సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో పేదలు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలకు ఆటంకం కల్పించడం బాధాకరమన్నారు. సంస్థ సేవలు పునరుద్ధరణకు ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే గౌరవాధ్యక్షుడు భోగేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయూఫ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ఐజేయూ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు కేపీ కుమార్, బాబు, రామచంద్ర, చలపతి, జీవీ, బాలరంగా రెడ్డి, తిప్పేస్వామి, లోకరాజు, లింగప్రసాద్, చౌడప్ప, సీనియర్ జర్నలిస్టులు మార్కెండేయులు, అక్బర్, రామకృష్ణ, ఆనందవర్దన్, నాయకులు మల్లికార్జున, మల్లేష్ రాము, అక్కులప్ప, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు



రాప్తాడులో ఊరేగుతున్న పీర్లు

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రాప్తాడు, హంపాపురం, గొల్లపల్లి, పాలచెర్ల గ్రామాల్లో చిన్న సరిగెత్తు వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు చిన్న సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములకు ప్రత్యేకంగా వెండి గొడుగులు అలంకరించారు. భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య పానకాల కుండలను తీసుకొచ్చి పీర్ల స్వాములకు చదివింపులు చేయించారు. మొక్కుబడి ఉన్న భక్తులు పెద్ద పెద్ద పూలమాలలను పీర్ల స్వాములకు వేశారు.

ఘనంగా పీర్ల గ్రామోత్సవం

చిన్న సరిగెత్తు కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. పూలహారాలు వేసిన పీర్ల దేవుళ్లకు గ్రామంలో పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు దారి పొడవునా స్వాములకు చక్కెర చదివింపులు చేయించారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో అగ్ని గుండాలను తవ్వారు. ఈనెల 19న పెద్ద సరిగెత్తు, 20న జలధి, 21న జల్తాన్ కార్యక్రమాలు ఉంటాయని గ్రామ పెద్దలు, ముల్లా సాహెబ్‌లు తెలిపారు.

'ఫ్లోరోసిస్'పై అవగాహన అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: ఫ్లోరోసిస్ వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన పెంచుకుని ప్రజలకు తెలియజేయాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్లు ఆంజనేయులు, శశికళ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లిన సమయంలో మల్టీ విటమిన్ మాత్రలు తీసుకెళ్లాలని సూచించారు. ఆహారపు అలవాట్లను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. వాటర్ శాంపిల్స్ సేకరించి అవసరమైన వారికి పునరావాస పరికరాలను పంపిణీ చేయాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులకు చేతికర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యోతుల ఉత్సవం



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: స్థానిక సున్నంగేరులో కొలువుదీరిన రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధి మాజీ మేయర్ రాగే పరుశురాం నేతృత్వంలో ఉదయం గంగపూజ, ఏకాదశ ద్రవ్యాభిషేకం, పుష్పాయాగం, సామూహిక లలితసహస్ర పారాయణం భక్తిశ్రద్ధలతో జరిగాయి. సాయంత్రం పాతూరు వీధుల్లో నగరోత్సవం, నవజ్యోతుల ఊరేగింపు వేడుకగా సాగాయి. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కలశాలు మోసి, మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.



రథం ముందు బాలికల నృత్యం



కోలాటం ఆడుతున్న మహిళలు



అలంకరణలో రేణుకా యల్లమ్మ